క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మల్యాల: రైతులు ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి, మద్దతు ధర పొందాలని డీఆర్‌డీవో నరేశ్, డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని రామన్నపేటలో బుధవారం డీఆర్‌డీవో నరేశ్, డీఎస్‌వో వెంకటేశ్వర్ రావు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం తూకం వేసి, పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజయ్య, డీటీసీఎస్ రాకేశ్, వరప్రసాద్, స్వామి, గంగరాజం, కృష్ణమోహన్, పుష్ప, లత, లహరి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగంపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న జిల్లాలోని సీఈవోలు

జగిత్యాలజోన్: రసాయన ఎరువుల వినియోగంపై ఇఫ్కో ఆధ్వర్యంలో పొలాస వ్యవసాయ కళాశాలలో సహకార సంఘాల సీఈవోలకు బుధవారం ప్రొఫెసర్లు శిక్షణ ఇచ్చారు. రసాయన ఎరువుల వినియోగంతో పాటు, నానో యూరియా వాడకంపై వివరించారు. అలాగే ద్రవరూపంలో ఉన్న నానో యూరియా వాడటం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ వేణుగోపాల్ రసాయన ఎరువుల వినియోగంపై, పత్తి మిరపలో నానో యూరియా వాడకంపై డాక్టర్ మహేశ్ వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణభట్, జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, ఇఫ్కో జిల్లా మేనేజర్, సీనియర్ ఫీల్డ్ మేనేజర్ చంద్రబాబునాయుడు, డాక్టర్ సంపత్, డాక్టర్ ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు ఎల్‌ఈడీ ప్రొజెక్టర్ వితరణ



ప్రొజెక్టర్ అందిస్తున్న వెంకటేశ్

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అర్థశాస్త్ర అధ్యాపకుడు గోవిందుల వెంకటేశ్ ఎల్‌ఈడీ ప్రొజెక్టర్‌ను వితరణ చేశారు. తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే రూ.15వేల విలువైన ప్రొజెక్టర్‌ను బుధవారం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్ అధ్యాపకులు అభినందించారు.

ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు



కథలాపూర్: ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధి, బీజేపీ నేత చెన్నమనేని వికాశ్‌రావు అన్నారు. బుధవారం కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి ప్రతిమ ఫౌండేషన్ ద్వారా వైకుంఠ రథం అందజేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సంఘ భవనం ధ్వంసం బాధాకరం

కథలాపూర్: మండలకేంద్రంలో మున్నూరు కాపు సంఘం భవనం ధ్వంసం చేయడం బాధాకరమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. బుధవారం కథలాపూర్‌లో ధ్వంసమైన మున్నూరు కాపు సంఘం భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. కుల సంఘం సభ్యులు అందరితో కలిసి మెలిసి ఉంటారని, మండల సంఘం భవనం ధ్వంసం చేయడం దారుణమన్నారు. త్వరలోనే వీడీసీ సభ్యులతో, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీపీ జవ్వాజి రేవతి, మున్నూరు కాపు సంఘం మండల ప్రతినిధులు ఉన్నారు.

ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వర్తించాలి

- ప్రతీ టీం అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, చిత్రంలో అధికారులు

జగిత్యాల: ఎన్నికల సిబ్బంది తమ విధులను నిర్భయంగా, పారదర్శకంగా నిర్వర్తించాలని, ప్రతి టీం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మోడల్ కోడ్ ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీవీటీ, వీఎస్‌టీ టీంలకు శిక్షణ కల్పించారు. టీమ్‌లకు ఇప్పటికే పలుమార్లు శిక్షణ ఇచ్చామని, సందేహాలుంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతీ అంశాన్ని వీడియోగ్రఫీ చేయాలని, నగదు, మద్యం రవాణా కాకుండా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. రూ.50 వేల కన్నా ఎక్కువగా ఉంటే సీజ్ చేయాలని, రూ.10 లక్షల కంటే ఎక్కువగా ఉంటే ఇన్‌కంటాక్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీ విజిల్‌యాప్‌ను ప్రతిఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలకు మించకూడదని, ఎక్కువ ఖర్చయితే అనర్హతకు గురవుతారని పేర్కొన్నారు. పోటీచేసే అభ్యర్థుల ఖర్చులను టీంలు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ లత, తిరుపతి, సుధీర్, డెప్యూటీ సీఈవో రఘువరుణ్, ఆడిట్ అధికారి సుజాత పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

కొనుగోలు కేంద్రాల్లో ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో కాల్‌సెంటర్‌ను ప్రారంభించారు. బస్తాకు 40.650 కిలోలు మాత్రమే తూకం వేయాలన్నారు. కేంద్రాల వద్ద సౌకర్యాలు ఏర్పాటుచేయాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు టోల్‌ఫ్రీ నంబరు 1800 425 8187 సంప్రదించాలన్నారు. జిల్లాలో మొత్తం 400 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

ఆడబిడ్డను ఆశీర్వదించండి



ఇంటింటి ప్రచారంలో భోగ శ్రావణి

జగిత్యాలటౌన్/సారంగాపూర్ ఆడబిడ్డగా మీ మద్దతు కోరుతున్న తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని జగిత్యాల బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని 38,45 వార్డుల్లో, బీర్‌పూర్ మండలంలోని పలుగ్రామాలు, సారంగాపూర్ మండలం రేచపల్లిలో ఆమె ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. శ్రావణికి మహిళలు ఘన స్వాగతం పలికారు.తనను ఆశిర్వదించి అసెంబ్లీకి పంపిస్తే జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట పార్టీ నాయకులు వీరబత్తిని అనిల్‌కుమార్, ఆముద రాజు, రంగు గోపాల్, దశరథరెడ్డి, సాంబారి కళావతి, నలువాల తిరుపతి, మ్యాడ జనార్దన్, ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్, ఎండబెట్ల వరుణ్‌కుమార్, బొడ్డు పెద్ద గంగారాం,కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం



ఓటర్లకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: పట్టణ అభివృద్ధే ధ్యేయమని, ఇప్పటికే అత్యధిక నిధులతో అభివృద్ధి చేసుకున్నామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం 39, 25 వార్డుల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అత్యాధునిక హంగులతో సమీకృత మార్కెట్, రూ.8 కోట్లతో చల్గల్ మార్కెట్ ఇలా ఎన్నో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సమిండ్ల వాణి, గట్టు సతీశ్, బండారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

ధర్మపురి: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర ఆదేశించారు. ధర్మపురిలోని న్యూ టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ .. రానున్న శాసన సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణచైతన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుకుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుట్ల ఆర్డీవో ఎస్. రాజేశ్వర్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో డీఎస్పీ రవీందర్ రెడ్డితో కలిసి బుధవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నియోజకవర్గ వ్యాప్తంగా మోడల్ కోడ్ ని అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. 80 ఏళ్లు పైబడ్డ వృద్ధులు, 40 శాతానికి పైగా అంగ వైకల్యం ఉన్న వ్యక్తుల కోసం ఓటేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చల్మెడకు మాదిగ నాయకుల మద్దతు

మేడిపల్లి: భీమారం మండలం రంగాపూర్‌లో అంబేద్కర్ సంఘం, మాదిగ కుల సంఘం సభ్యులు చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. సంఘం సభ్యులు వేములవాడలో చల్మెడను కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బంగారు దీపక్, కుమారస్వామి, గంగరాజు, ప్రసాద్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే కులసంఘాల అభివృద్ధి



పార్టీలో చేరిన వారితో లోక బాపురెడ్డి



రవిశంకర్‌కు మద్దతుగా నాయకుల ప్రచారం

కథలాపూర్: గ్రామాల్లో కులసంఘాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. బుధవారం కథలాపూర్ మండలం భూషణరావుపేటలో బ్లూస్టార్ యూత్ సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలోని శాలివాహన, రజక, గూండ్ల, గిరిజన సంఘం సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. తాము బీఆర్‌ఎస్‌కు పూర్తి మద్దతిస్తామని సంఘం సభ్యులు సమావేశంలో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, రైతు బంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్, కొత్తపెల్లి శ్రీనివాస్, గడ్డం శేఖర్‌రెడ్డి, తీట్ల శంకర్, తరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం

పెగడపల్లి: మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. పెగడపల్లి మండలంలోని నందగిరి, పెగడపల్లి, అయితిపల్లి తదితర గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

మల్యాలలో ఇంటింటా ప్రచారం

మల్యాల: మండల కేంద్రంలో చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు మద్దతుగా బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారురేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి,ప్రచారం ప్రారంభించారు. బీఆర్‌ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, ఉప సర్పంచ్ పోతరాజు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు

మల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు చేకూరుతుందని బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు బొడ్డు రాజేశ్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని సాతారంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్‌ని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అచ్చ చిన్నరాజం, ఉపసర్పంచ్ మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ బడే బాలు, నాయకులు పాల్గొన్నారు.

'ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు లేదు'

రాయికల్: ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కు లేదని టీడీపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి మహంకాళి రాజన్న అన్నారు. బుధవారం రాయికల్‌లో మాట్లాడుతూ 2018 మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీఎం కేసీఆర్ ఒక పథకాన్ని కూడా అమలు చేయలేదని, కేజీ టు పీజీ, డబుల్‌బెడ్ రూం, నిరుద్యోగ భృతి అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధిచెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కాశీనాథం, బీసీసెల్ స్టేట్ ఉపాధ్యక్షుడు భార్గవ్, సోమనారాయణరెడ్డి, కొండ శ్రీధర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూస్తాం

- జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

జగిత్యాలఅగ్రికల్చర్: ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చూస్తామని జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్.లత అన్నారు. జగిత్యాల మార్కెట్‌యార్డులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 400కు పైగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు తేమ లేని, ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకవచ్చి, ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరారు. కొనుగోళ్లలో ఎక్కడైనా ఇబ్బందులు వస్తే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాయాధికారి సత్యనారాయణ, జిల్లా ఉన్నతాధికారులు, సంఘ సీఈవో వేణు పాల్గొన్నారు.

మండల అభివృద్ధి డీఎస్పీతోనే సాధ్యం

మేడిపల్లి: మండల అభివృద్ధి డీఎస్పీతోనే సాధ్యమని ధర్మసమాజ్ పార్టీ వేములవాడ అభ్యర్థి గడ్డం హరీశ్ గౌడ్ ప్రచారం నిర్వహించారు. బీమారం , కమ్మరిపేట, వెంకట్రావుపేట, కాచారం, గ్రామాల్లో ప్రచారం చేశారు. యువకులు, కులసంఘాల నాయకులను కలిసి టార్చ్ లైట్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోటేశ్, ప్రశాంత్, వెంకటేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

మంత్రి కొప్పులకు మద్దతుగా సతీమణి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో కొప్పుల స్నేహలత

వెల్గటూర్: మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా మంత్రి సతీమణి ఎల్.ఎమ్ కొప్పుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొప్పుల స్నేహలత మండలంలో రాజక్కపల్లిలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధిని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి వివరించారు. మరోసారి అభివృద్ధికి పట్టం కట్టాలని, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆదరించి, అవకాశమివ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సర్పంచ్ బోడకుంటి రమేష్, ఉప సర్పంచ్ మంగ, వార్డు సభ్యులు,నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అడ్లూరి' కి అవకాశం ఇవ్వండి



శాలపల్లె లో ప్రచారం చేస్తున్న నాయకులు

పెగడపల్లి: ధర్మపురి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఒకసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులు ప్రజలను కోరారు. పెగడపల్లి మండలంలోని శాలపల్లి, అడుపపల్లి గ్రామాల్లో లక్ష్మణ్‌కుమార్‌కు మద్దతుగా నాయకులు బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ఆరు గ్యారంటీ స్కీం కార్డుల పంపిణీ చేస్తూ బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రామగౌడ్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, శంకర్, మల్లారెడ్డి, విజయభాస్కర్, మల్లేశం, రాజేందర్, తిరుపతి, రమేశ్, పాల్గొన్నారు.

అధికారంలో కొస్తే చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి

మల్లాపూర్: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి రాగానే షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని ముత్యంపేటలో బుధవారం జువ్వాడి కృష్ణారావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంతో పాటు తెలంగాణలో మార్పు కోసం ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, ఖర్గే, రాహుల్ గాంధీ ప్రకటించిన గ్యారంటీ కార్డులు, డిక్లరేషన్‌తో తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎలాల జలపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గోవిందారంలో గడప గడపకూ కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఆది శ్రీనివాస్ కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నరేశ్ రెడ్డి, సీరటి మల్లెశం, నల్లపు శేఖర్, అనిల్, వెంకటేశ్, ఆదిరెడ్డి, లక్ష్మినర్సయ్య, చాందు, వరుణ్ పాల్గొన్నారు.

సంజయ్‌కు జీపు డ్రైవర్ల మద్దతు



సంజయ్‌కు మద్దతు తెలుపుతున్న డ్రైవర్లు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో జీపు, ఆటో, టాటా మ్యాజిక్ యూనియన్ డ్రైవర్లు బుధవారం కోరుట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. తీర్మానం కాపీని పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లాల దశరథ్‌రెడ్డి, ఎంపీపీ జాజాల భీమేశ్వరిలకు అందచేశారు.కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ సోమ ప్రభాకర్, నాయకులు దెొట్టి రాజరెడ్డి, సున్నం సత్యం, తిరుపతిరెడ్డి, పెంట లింబాద్రి పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బరిలో ఉంటా'

మెట్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో కోరుట్ల నుంచి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉంటానని సీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన పద్నాలుగేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న విద్యాసాగర్‌రావు ఒక్క రాష్ట్రస్థాయి నామినేటేడ్ పోస్టును కూడా బీఆర్‌ఎస్ నాయకులకు ఇప్పించలేదన్నారు. ప్రస్తుతం ఆయన రాజకీయ వారసుడిగా తనయున్ని పోటీ చేయిస్తున్నారని, ప్రజలు ఇలాంటి వాటిని తిరస్కరించాలన్నారు. సీఎస్ఆర్ ఫౌండేషన్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని, ఎన్నికల్లో ప్రజలు గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ

గొల్లపల్లి: మండలంలోని గొల్లపల్లి, శ్రీరాములపల్లి, దమ్మన్నపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార విలువలు తెలుపుతూ అంగన్‌వాడీ టీచర్లు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తాండ్ర రమ, హరిప్రియ, సైండ్ల రజిత, ఆశా వర్కర్లు లత, జమున పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



జగిత్యాలరూరల్: హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఈనెల 4,5 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని మౌంట్ కార్మెల్ పాఠశాల విద్యార్థి సాయి శ్రేయస్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సాయి శ్రేయస్‌ను బుధవారం ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతిస్, సిస్టర్ జోస్మి, సీమ, సోఫీ, శృతి, పీఈటీలు మంగ, విజ్ఞాన్, సామంత్, హరీశ్ అభినందించారు.

ప్రజాగర్జన సభ విజయవంతం చేయాలి

కోరుట్ల: ఈ నెల 4వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించే ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పేట భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల హక్కుల సాధనకోసం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే సభకు భారీగా తరలి రావాలని కోరారు.

'ఆరోగ్య మహిళ' వినియోగించుకోవాలి

జగిత్యాల: ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. పట్టణ ఆరోగ్యకేంద్రంలో మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం ఉంటుందన్నారు. రక్తహీనత, అధిక బరువు, మహిళల నెలసరి పరీక్షలను మహిళా డాక్టర్ల ద్వారా పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆరోగ్య మహిళ లోమహిళలకు ఆరోగ్య సమస్యలుంటే ముందుగానే తెలుసుకోవచ్చన్నారు. ప్రోగ్రాం అధికారి జైపాల్‌రెడ్డి, చైతన్యరాణి, వేణుగోపాల్, సౌజన్య పాల్గొన్నారు.

ధర్మపురిలో వైద్య శిబిరాల సందర్శన

ధర్మపురి: పట్టణంలోని గిరుకల కాలనీలో, పాత పోస్టాఫీస్ వద్ద ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కలరా, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడే వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని డిప్యూటి డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విషజ్వరంతో సమన్వి మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దామోదర దీపోత్సవం



ఇస్కాన్ మందిరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లిలో పెద్దాపూర్ ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో కార్తీక దామోదర దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమాన్ నరహరి ప్రభుజీ భక్తులకు దివ్యప్రవచనం ఇచ్చారు. కార్తీక దామోదర మాసం విశిష్టతను తెలియజేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద సంకీర్తనలు చేశారు. కార్యక్రమంలో ఆత్మకూర్ సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు అరెళ్ల రాజాగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.